## క్లుప్తంగా

### మర్రిపేట పాఠశాలకు మరమ్మతులు చేస్తాం


మర్రిపేట పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీపీ సత్యవాణి

**మలికిపురం :** మండల ప్రజా పరిషత్ అధీనంలోని ఎంపీపీ పాఠశాలలను శనివారం ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి సందర్శించారు. ఇటీవల జరిగిన మండల ప్రజా పరిషత్ సాధారణ మీటింగ్ లో ఎంపీటీసీ నల్లి అంజలీదేవి గుడిమెళ్లంక గ్రామం అయ్యవారితిప్ప, మర్రిపేట ఏరియాల్లో ఉన్న మండల పరిషత్ పాఠశాలలకు అత్యవసరంగా రిపేర్లు చేయించాలని సభ దృష్టికి తీసుకువచ్చిన దృష్ట్యా మండల ప్రజా పరిషత్ సిబ్బందితో కలసి పాఠశాల భవనాలు పరిశీలించారు. పాడైన భవనం తొలగించుటకు, మిగిలిన భవనాలకు రిపేర్లు చేయుటకు అంచనాలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. ఎంపీపీతో పాటు మండల విద్యాశాఖ అధికారులు ఎం.విజయశ్రీ, వైవీవీ సత్యనారాయణ, మండల ఇంజినీరింగ్ అధికారి ఎంవీఎస్‌పీ రవికుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, నాయకులు మేడిచర్ల రాము తదితరులు పాల్గొన్నారు.

### లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

**సఖినేటిపల్లి:** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పెరుగుతున్న వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని బీజేపీ సీనియర్ నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం సఖినేటిపల్లిలో ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావులు మాట్లాడారు. కాగా గతంలో వరద ముంపు బాధితులకు కోసం పలు సౌకర్యాలు కల్పనకు సమకూర్చిన వాటికి, వరద నీటిలో ప్రయాణికులు రాకపోకలకు ఏర్పాటు చేసిన గ్రూపు పడవల యజమానులకు మిగిలిన బకాయిలను చెల్లించేలా చూడాలని అధికారులను కోరారు.

### ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు ప్రశంసా పత్రాలు


డ్రైవర్, కండక్టర్లను అభినందస్తున్న డిపో మేనేజర్ కుమార్

**రావులపాలెం:** స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదివారం డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సంవత్సరం జూన్ నెలలో అత్యధిక ఇంధనం పొదుపు సాధించిన పి.ప్రకాష్ రావు, సీహెచ్ గంగాధరరావు, ఎంఎం కృష్ణలను అదే విధంగా అధిక ఆదాయం సంపాదించిన కండక్టర్లను కేకే రావు, ఎం.శ్రీధర్, కె.జ్యోతికుమారిలకు, డీపీటీఓ మేడిశెట్టి శ్రీనివాసరావు పంపించిన ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేసి అభినందించారు.

### కిడ్నీ బాధితుడికి రూ.30 వేల సాయం


ఎల్.గన్నవరంలో యువకుడికి ఆర్థిక సాయం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

**పి.గన్నవరం:** ఎల్.గన్నవరంలోని డొక్కా సీతమ్మ కాలనీకి చెందిన కొల్లు రవీంద్ర కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆ యువకుడికి మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం రూ.30 వేల సాయం అందించారు. రవీంద్రకు ఇటీవల రెండు కిడ్నీలు పాడవడంతో వైద్యం చేయించుకునేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఫెడరేషన్ నాయకులు సాయం అందించారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు దూనబోయిన రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గిడ్ల శ్రీనివాసరావు, నాయకులు కె.రవికుమార్, జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

### డయేరియాపై నిర్లక్ష్యం వద్దు

**అంబాజీపేట:** డయేరియాపై నిర్లక్ష్యంగా ఉండకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. నందంపూడి శివారు అమ్మవారితోటలో డయేరియా పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో జ్వరాలు, డయేరియా సోకే అవకాశాలు ఉన్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. బయట వంటకాలకు స్వస్తి చెప్పి ఇంటిలో వండిన వాటినే వేడి వేడిగా తినాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

# కుష్ఠు వ్యాధి రహిత సమాజాన్ని స్థాపిద్దాం

- చురుగ్గా నిర్మూలన పక్షోత్సవాలు
- అందుబాటులో బహుళ ఔషధ చికిత్స
- అవగాహనతో తగ్గుతున్న రోగుల సంఖ్య
- క్లస్టర్‌లో 57 మంది రోగుల గుర్తింపు


పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో కుష్ఠు వ్యాధి నిర్మూలన ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

**అలమూరు:** ఆరోగ్యమే మహాభాగ్యం.. సంపూర్ణ ఆరోగ్య సాధనే సగటు జీవి లక్ష్యం.. వంశ పారపర్యంతో కాని ప్రకృతి ప్రభావిత అంశాలతో కాని మానసిక, శారీరక సమస్యలు అప్పుడప్పుడు సంభవిస్తుంటాయి. అలాంటి ప్రయత్నంలో భాగంగా కుష్ఠు వ్యాధి నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా క్షేత్రస్థాయిలో కృషి చేస్తూ చక్కని ఫలితాలు సాధిస్తున్నాయి. కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా ఇప్పటికే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి శరీరంపై అనుమానిత మచ్చలు ఉన్న వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ చేపట్టారు. వ్యాధి లక్షణాలున్న వారికి అధునాతన బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ)ను అందిసూ కుష్ఠు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా వైద్యారోగ్య సిబ్బంది కృషి చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఉన్న 24 పీహెచ్‌సీల్లో ఈనెల 18 నుంచి ఆగస్టు 02 వరకూ తొలివిడత పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. అలాగే వైద్యారోగ్య సిబ్బంది గత ఏడాది డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 12 కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలను నిర్వహించారు కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా ఆయా పీహెచ్‌సీల పరిధిలో గత ఐదేళ్ల నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 284 మందికి కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే అందులో 183 మందికి ఈ వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది అందులో 51 మంది కుష్ఠు వ్యాధితో బాధపడుతుండగా మరో 50 మంది ఆరు నెలలు చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అయ్యే పరిస్థిని నెలకొంది. క్లస్టర్ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం 57 మంది రోగులకు కుష్ఠు వ్యాధి చికిత్స జరుతుంది. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రతి నెలా మొదటి వారం కుష్ఠు వ్యాధి నివారణ బృందం విచ్చేసి రోగులకు ప్రత్యేక చికిత్సను అందిస్తూ త్వరితగతిన కోలుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

**బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ)తో కుష్ఠు వ్యాధి దూరం**

మైక్రో బ్యాక్టీరియా ప్రభావంతో ఈ కుష్ఠు వ్యాధి సోకుతుంది. శరీరంపై రాజరంగు మచ్చలొస్తాయి. ఆ మచ్చల ప్రదేశంలో వెంట్రుకలు రాలిపోతాయి. అటువంటి మచ్చలపై దురద, స్పర్శ, నొప్పి ఉండవు. ఈ ప్రారంభ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆశ, ఏఎన్ఎంలకు తెలియజేయాలి. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్సను అందించడంతో పాటు వ్యాధి తీవ్రత తగ్గే వరకూ రోగికి చికిత్స పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తారు. వ్యాధి గ్రస్తులు మానసికంగా దృఢంగా ఉండేలా కౌన్సెలింగ్ ఇచ్చి భవిష్యత్ వ్యాధి నియంత్రణపై భరోసా కల్పిస్తారు. పుండ్లు ఉన్నవారికి అవసరాన్ని బట్టి కత్తిపూడిలోని రిఫరల్ లెప్రసీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేస్తారు. చికిత్స చేయించుకునే సమయంలో రోగికి రూ.ఎనిమిది వేలు పారితోషికాన్ని కూడా అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వ్యాధిగ్రస్తులకు రూ.పదివేలు పింఛన్, నెలకు 35 కిలోల బియ్యం అందిస్తుంది.

### కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వే నిష్పక్షపాతంగా చేయాలి

**అంబాజీపేట:** జిల్లాలో ఉన్న కుష్ఠు వ్యాధి గ్రస్తుల సర్వేను నిష్పక్షపాతంగా చేసి పూర్తి వివరాలు సేకరించాలని ఎల్‌సీడీసీ జిల్లా అధికారి సీహెచ్‌వీ భారతి అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అంబాజీపేటలో జరుగుతున్న కుష్ఠు వ్యాధి గ్రస్తుల సర్వేను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి వి.గౌతమి అధ్యక్షతన శనివారం పరిశీలించారు. భారతి మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది 101 మంది కుష్ఠు కేసులు ఉన్నాయని ప్రస్తుతం ఈ ఏడాది ఇప్పటి వరకు 56 కేసులను గుర్తించామన్నారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కుష్ఠు వ్యాధి, డెంగీ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.మధుబాబు, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.ప్రమీల, ఎల్‌టీ రవితేజ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

### గుర్తింపునకు ప్రత్యేక కార్యాచరణ



కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్యారోగ్య సిబ్బంది చేపట్టిన ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు వివరిస్తున్న కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. చిన్నారుల శరీరాలను పరీక్షించి మచ్చలు ఉన్నట్లయితే సంబంధిత వైద్య నిపుణులకు నివేదిస్తున్నాం. పీహెచ్‌సీ స్థాయిలో వైద్యాధికారి, డివిజన్ స్థాయిలో డీపీఎంఓ స్థాయి అధికారి షెడ్యూల్ ప్రకారం పీహెచ్‌సీల్లో పర్యటిస్తూ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

– డి.సువర్చలాదేవి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చొప్పెల్ల

### కుష్ఠు వ్యాధిపై అపోహలు వద్దు



కుష్ఠు వ్యాధి పట్ల అపోహలు వీడాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలి. పాఠశాలలు, క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నాం. కుష్ఠు వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమించదు. ప్రభుత్వం క్రమం తప్పకుండా సర్వే, చికిత్స, ప్రభుత్వ సాయాన్ని అందిస్తుంది.

– ఏవీవీ రాజా అక్కుల, హెల్త్‌ఎడ్యుకేటర్, పీహెచ్‌సీ పెదపళ్ల

## గోదావరి మాతకు పున్నమి హారతి


జొన్నాడ పుష్కరఘాట్ వద్ద గోదావరి మాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

**ఆలమూరు:** మండలంలోని జొన్నాడ అఖండ గౌతమీ గోదావరి తీరంలో గౌతమీ గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. క్రోధి నామ సంవత్సర ఆషాఢ శుద్ధ గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి ప్రముఖ వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహిళ భక్త బంద సభ్యులు శాస్త్రోక్తంగా ఈపున్నమి హారతిని చేపట్టారు. గోదావరి మాతకు అఖండ పున్నమి హారతిని ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వివిధ ఆలయాల్లో విష్ణు, లలిత సహస్రనామాలు, కనకధార, అష్టోత్తరం, వేద పారాయణ చేశారు.

### నేడు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పురస్కారాలు

**మామిడికుదురు:** రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని సంఘం అధ్యక్షుడు భూపతి మనోహరరాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్ బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు శనివారం తెలిపారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో 57 మంది ప్రతాభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.1.50 వేలు నగదు ప్రోత్సాహాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు.

### వర్షపు నీటిని బయటకు పంపాలి

**అంబాజీపేట:** వాయుగుండం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు నారుమడులలో నిలిచిపోయిన వర్షపు నీటిని తొలగించాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. ఇసుకపూడి, చిరతపూడి, మొసలపల్లి, పసుపల్లి, వక్కలంక, పుల్లేటికుర్రు, గంగలకుర్రు తదితర గ్రామాల్లో నీట మునిగిన వరి నారుమడులు, వరి పొలాలను ఏఓ శనివారం పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ నీట మునిగిన వరి నారుమడుల్లో కార్బండిజమ్, ఎగ్జాకొనజోలు స్ప్రేయింగ్ చేయాలన్నారు. వీలైనంత త్వరగా వర్షపు నీటిని బయటకు వెళ్లే మార్గం చేసుకోవాలన్నారు.

### బీమాతో పేదలకు ఆర్థిక భరోసా

**మలికిపురం:** ప్రతి ఒక్కరూ ఏదైనా బీమా నమోదు చేయించుకుని లబ్ధి పొందాలని తద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. నియోజకవర్గంలోని 50 మంది పార్టీ సభ్యత్వం ద్వారా లభించిన బీమా నగదు చెక్కులను మలికిపురంలో శనివారం ఆయన అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ లబ్ధి చేకూరే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పార్టీ శ్రేణులు విమర్శలకు తావు లేకుండా పని చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కారణంగా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి సహాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సమన్వకర్త గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, మండల పార్టీ అధ్యక్షులు మల్లిపూడి సత్తిబాబు, దిరిశాల బాలాజీ, గంటా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### కిటకిటలాడిన వేంకటేశ్వరుని ఆలయం

**అయినవిల్లి:** మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసీ పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

### ఆస్పత్రి అసిస్టెంట్ శ్రీనుకు ఘన నివాళి

**కొత్తపేట:** వైద్య విధాన పరిషత్ స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ మృతి చెందిన జగత శ్రీనివాసరావుకు ఆసుపత్రి వైద్యులు సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. సుదీర్ఘకాలంగా ఆస్పత్రిలో సహాయకునిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఈనెల 18 రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులు సిబ్బంది సిబ్బంది శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌన పాటించారు. కార్యక్రమంలో అమలాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు మధుకర్, స్థానిక ఆసుపత్రి వైద్యులు, స్టాఫ్ నర్సులు ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీనుకు నివాళులర్పిస్తున్న వైద్యులు సిబ్బంది

# శాంతించిన వరుణుడు


నల్లచెరువులో వరి చేలను పరిశీలిస్తున్న మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక శాస్త్రవేత్తల బృందం

**మామిడికుదురు:** భారీ వర్షాలు తగ్గుముఖం పట్టాయి. కానీ ఇంకా ముసురు మాత్రం వీడలేదు. భారీ వర్షాల వల్ల ఏర్పడిన ముంపు సమస్య రైతులను వెన్నాడుతోంది. మామిడికుదురు, నగరం, గెద్దాడ, మొగలికుదురు, పెదపట్నం, పాశర్లపూడి గ్రామాల్లోని పంట పొలాలు ముంపు నీటిలోనే ఉన్నాయి. వీటితో పాటు నారుమడులు సైతం ముంపు నుంచి ఇంకా బయటపడలేదు. మామిడికుదురు మండలంలో 127 ఎకరాల్లో నారుమడులు వేయగా వాటిలో 50 ఎకరాలు ముంపు బారిన పడ్డాయని మండల వ్యవసాయధికారి బి.మృదుల శనివారం తెలిపారు. 230 ఎకరాల్లో వరి నాట్లు వేయగా 60 ఎకరాలు ముంపుబారిన పడిందన్నారు. దీంతో పాటు ముంపునకు గురైన రోడ్లుపై ఇంకా వర్షం నీరు నిలిచే ఉంది. ప్రధాన రోడ్లతో పాటు ఆర్అండ్‌బీ రోడ్లు, పంచాయతీరాజ్ రోడ్లు ముంపు నుంచి బయటపడలేదు. వర్షాలు శాంతించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

**నిండా ముంచిన వాన**

**అంబాజీపేట:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి చేలు, నారుమడులు నీట మునిగాయి. మండలంలో శనివారం కురిసిన 13 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి 50.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో వరిచేలు, నారుమడులు, అంతర పంటలు నీట మునిగాయి. వర్షానికి జనజీవనం స్తంభించింది. చిరు వ్యాపారాలు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అరటి, కొబ్బరితోటల్లో వర్షపు నీరు చేరింది.

**నారుమడులు పరిశీలించిన అధికారులు**

**మలికిపురం:** మండలం దిండి గ్రామంలో అకాల వర్షాలకు నీట మునిగిన నారుమడులను జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు శనివారం పరిశీలించారు. గ్రామంలో నీట మునిగిన నారుమడులను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ముంపు బారి నుంచి రక్షణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ రాజశేఖర్, రాజోలు ఏడీఏ రామ్మోహన్‌రావు, మండల వ్యవసాయ అధికారి మలికిపురం యస్.రాకేష్ , సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు వీఏఏలు నాగమణి, సందీప్ పాల్గొన్నారు.

**రాజోలు:** మంపునకు గురైన వరి నారుమడులను జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు శనివారం పరిశీలించారు. మండలంలోని రాజోలు, తాటిపాక, సోంపల్లి గ్రామాల్లోని రైతులను కలిశారు. ముంపునీరు దిగకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు. నారుమడులు రక్షించుకునేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. వరినారు కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని బోసుబాబు సూచించారు. ఏడీఏ రామ్మోహన్, ఏఓ మధుకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు అబ్బాస్, సాయి, రైతులు పాల్గొన్నారు.

**అయినవిల్లి:** అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు ముంపులో ఉన్న వరి చేలను మార్టేరు వ్యవసాయ కేంద్ర శాస్త్రవేత్తలు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు నల్లచెరువులో శనివారం పరిశీలించారు. అమలాపురం ఏరువాక కేంద్రం కోఆర్డీనేటర్ ఎం.నందకిశోర్ మాట్లాడుతూ నాట్లు వేసిన వెంటనే పిలక దశలో ముంపునకు గురైయితే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువు బూస్టర్ డోస్‌గా వేయాలన్నారు. అలాగే నీరు పూర్తిగా తీయలేని పక్షంలో ఆకుపై 2 శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయాలన్నారు. అలాగే వరి పూర్తిగా కోలుకున్న తర్వాత మాగుడు తెగులు, ఇతర కుళ్లు సోకకుండా కార్బండిజం ఒక గ్రామ లేదా కార్బండిజం, మాంకోజెబ్ మిశ్రమాన్ని 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కృష్ణాజీ, దాయల్, ఆనంద్, అయినవిల్లి మండల వ్యవసాయ అధికారి వై.శోభ తదితరులు ఉన్నారు.


దిండిలో నారుమడులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

**నీటిలోనే కుళ్లుతున్న ఆకుమడులు**

**అయినవిల్లి:** మండలంలోని వరినారుమడులు, నాట్లు ముంపునీరు దిగక కుళ్లుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు రోజులు తరబడి పంటచేల్లో ఉండి పోవడంతో పంటచేలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. దెబ్బతిన్న వరి చేలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే నారుమడులు, నాట్లు కోసం ఏకరాకు రూ.30 వేల నుంచి 40 వేల వరకూ పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. మండలంలోని అయినవిల్లి, నల్లచెరువు, విలస, సిరిపల్లి, మాగం, కొండుకుదురు, ఎస్. మూలపాలెం, శానపలిల్లంక గ్రామాల్లోని వరిచేలు ముంపులో ఉన్నాయి.

# పెరుగుతున్న వరద ఉధృతి


పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

**పి.గన్నవరం:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే సరిహద్దు జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక గ్రామాల ప్రజలు మండలంలోని యర్రంశెట్టివారిపాలెం నుంచి పడవలపై ప్రయాణిస్తున్నారు.

**తీర గ్రామ ప్రజల్లో వరద భయం**

**మామిడికుదురు:** మండలంలోని పెదపట్నం మధ్య లంకలో పశుగ్రాసం శనివారం ముంపుబారిన పడింది. వరద మరింత ఉధృతం కానున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా రైతులు పశుగ్రాసాన్ని పడవలపై నది ఎగువ ప్రాంతానికి తరలించారు. అప్పనపల్లి స్నానఘట్టంతో పాటు పాశర్లపూడిబాడవ వైనతేయ వారధి వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. గోదావరి వరద మరింత పెరిగిన పక్షంలో పెదపట్నం, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలతో పాటు పాశర్లపూడి, పాశర్లపూడిబాడవ మత్స్యకార ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. మండల ప్రత్యేకాధికారి, అమలాపురం ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి వరద పరిస్థితిపై అధికారులతో చర్చించారు.

**పెరిగిన వరద నీటిమట్టం**

**అయినవిల్లి:** వరదనీటి మట్టం శుక్రవారం కంటే శనివారం అడుగు మేర పెరిగింది. ముక్తేశ్వరం వృద్ధ గౌతమిపాయలో వరదనీటి మట్టం అలాగే ఉంది. ముక్తేశ్వరం–కోటిపల్లిరేవు మునకతో పంటు ప్రయాణం ఆగిన విషయం తెలిసిందే. అయితే రైతులు మాత్రం నాటు, ఇంజిన్ పడవల సాయంతో లంకలోకి వెళ్లి తమ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కూరగాయ, అరటి, కోకో వంటి పంటలు వరదనీట మునిగాయి.

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం


పెనికేరులో పంట నీట మునిగిన రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆలమూరు:** భారీ వర్షాల ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. మండలంలో పెనికేరు, మోదుకూరు, కలవచర్ల, గుమ్మిలేరు, అలమూరు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులతో రైతులను కలసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు పంట పొలాల నుంచి బయటకు వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాల వల్ల ఏర్పడిన నష్టాన్ని వచ్చే శాసనసభ సమావేశాల సందర్భంగా ప్రస్తావించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. టీడీపీ నేతలు ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్, సలాది నాగేశ్వరరావు, సర్పంచ్ వడ్డి వెంకన్న, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఏఓ ఎస్.లక్ష్మీ లావణ్య పాల్గొన్నారు.

# వీఓఏ పోస్టును స్థానిక మహిళకే ఇవ్వాలి


ఏపీఎం అజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న డ్వాక్రా మహిళలు

**మామిడికుదురు:** మొగలికుదురు గ్రామంలో ఖాళీగా ఉన్న వీఓఏ (డ్వాక్రా యానిమేటర్) పోస్టును స్థానికేతర మహిళకు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ నిర్ణయాన్ని తక్షణం ఉప సంహరించుకోవాలని కోరుతూ స్థానిక మహిళలు డీఆర్‌డీఏ ఏపీఎం డి.అజయ్‌కు శనివారం వినతిపత్రం ఇచ్చారు. మామిడికుదురులో ఏపీఎంను కలిసి దీనిపై వినతిపత్రం అందజేశారు. మొగలికుదురుకు చెందిన ఎస్సీ సిర్రా విజయలక్ష్మికి వీఓఏ పోస్టును ఇవ్వాలని గతంలోనే నిర్ణయించారని, ఎన్నికల నోటిఫికేషన్ వల్ల జాప్యం జరిగిందన్నారు. విజయలక్ష్మినే ఆ పోస్టులో నియమించాలని కోరారు. స్థానికేతర మహిళకు ఆ పోస్టు ఇస్తే ఊరుకునేది లేదన్నారు. ఎస్సీ మహిళకు ఇవ్వాల్సిన పోస్టును ఓసీ మహిళకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో విప్పర్తి సత్యవతి, బూల గనికమ్మ, సిర్రా సత్యవతి, జల్లి పుష్పావతి, యార్లగడ్డ జీవవాణి తదితరులు ఉన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**మామిడికుదురు:** భారీ వర్షాల నేపథ్యంలో పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీపీఓ డి.రాంబాబు సూచించారు. గెద్దాడ గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. ముంపుబారిన పడిన పంట పొలాలు, నారుమడులను, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల్ని పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో డయేరియాతో పాటు ఇతర అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తాగునీటి లీకేజీలను అరికట్టాలని, ఎప్పటికప్పుడు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. పారిశుధ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గోదావరి వరదల నేపథ్యంలో తీర గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండాలని, బాధితులకు సహాయం, పారిశుధ్యం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్ ఉన్నారు.

# గురుపౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి

**ఆలమూరు:** ఉభయగోదావరి జిల్లాల్లోనే మొదటి షిర్డీ సాయినాథుని ఆలయం గ్రామంలో ఉంది. ఇక్కడ పాలరాయితో నిర్మించిన శ్రీషిర్డీ సాయి నాథుడి విగ్రహం చక్కని సుందర రూపంలో ఉంటుంది. ముఖ వర్చస్సు గులాబి రంగులో దగదగ లాడుతుంది. స్థానిక ఆలయంలోని శ్రీషిర్డీ సాయినాథుడ్ని దర్శించుకుంటే పుణ్యక్షేత్రమైన షిర్డీలో సాయిబాబానే దర్శించుకున్నట్లు అనే భావన స్థానిక భక్తుల్లో వ్యక్తమవుతుంది. దీంతో గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీషిర్డీ సాయినాథుడ్ని దర్శించుకుని తన్మయుత్వం చెందుతారు. ప్రస్తుత ఆలయ కమిటీ నేతృత్వంలో ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది. గురుపౌర్ణమి సందర్భంగా ఏటా భారీ స్థాయిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటిగా మారింది.